# సర్వ మంగళా స్తోత్రము

## పద్య కృతి

సీ. శ్రీమాత! శ్రీవిద్య! శ్రీమన్మహారాజ్ఞి!
సింహాసనేశ్వరి! సింహవాహ!
శ్రీ రాజరాజేశ్వరి! త్రిపుర సుందరి!
చిద్వహ్ని సంభూత! శ్రీమహేశి!
శ్రీ లలితాంబిక! శ్రీ సదాశివకాంత!
సద్గతిప్రద! సుధాసారకలిత!
శ్రీచక్రరాజవాసిని! చంద్రశేఖరి!
సర్వశక్తి నిధాన! చారు రూప!
తే. సర్వలోక వశంకరి! స్వర్ణగర్భ!
సర్వ వేదాంత సంవేద్య! జ్ఞానదాత్రి!
సర్వ వర్ణోపశోభితా! స్వప్రకాశ!
సర్వ మంగళా దేవి! నిన్ సంస్తుతింతు

రచయిత : పండిత నేమాని

## అంకితము

తెలుగు సాహిత్య రంగములో నేను పద్య రచనకు శ్రీకారము చుట్టి ఏబది వసంతాలు నిండిన వేళ సువర్ణ జయంతిని పురస్కరించుకొని, ఆనందోత్సాహాలు వెల్లివిరియు చుండగా పలుకుల తల్లి నా చేత రచింపజేసిన ఈ "సర్వమంగళాస్తోత్రము" ఆ జగన్మాతకు "సువర్ణ సుమమాల" కాగలదని నమ్ముచు, ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులకు నమస్సుమాంజలి ఘటించుచు సవినయముగ సమర్పించుచున్నాను.

ఉ. అక్షర రూప వైభవ సమన్వితు లాదిమ దంపతుల్, జగ
ద్రక్షకులైన మీ చరణ తామరసంబుల కంజలించి, నే
నక్షర రమ్య పద్యకృతి నంకిత మిచ్చెద స్వీకరింపుడీ,
త్ర్యక్ష శుభాంగులార! లలితా పరమేశ్వరులార! సత్కృపన్

శ్రీమాత్రే నమః                                                    శివాయ గురవే నమః

# ఉపోద్ఘాతము

## ఓం ఐం హ్రీం శ్రీం

ఉ.	ఓమ్మను పుండరీకమున నొప్పెడు పద్మభవాండ పాలినీ!
ఐమ్మను జ్ఞానమందిరమునందు జెలంగెడు వేదసంస్తుతా!
హ్రీమ్మను క్షేత్రరాజమున హృద్యముగా విహరించు నీశ్వరీ!
శ్రీమ్మను నీ పదాంబురుహ సీమను మ్రొక్కెద సర్వమంగళా!

ఓం	అనగా మహత్త్వము	:	శ్రీమాత అనంత మహత్త్వసమేత
ఐం	అనగా జ్ఞానము	:	ఆ భగవతి సంపూర్ణ జ్ఞాన నిధానము
హ్రీం అనగా శక్తి	:	శ్రీదేవి సమగ్ర శక్తిమయి
శ్రీం అనగ సంపద	:	ఆ మాహేశ్వరి సకల సంపద్విరాజిత

శ్రీ విద్య, బాల, త్రిపుర సుందరి, రాజరాజేశ్వరి, లలితా పరా భట్టారిక మొదలైన నామ రూపగుణ విశేషములతో తెలియబడు ఆ జగన్మాతను శ్రీమాత, శ్రీమహారాజ్ఞి, శ్రీమత్సింహాసనేశ్వరి మొదలగు ననంత నామములతో భక్తులు స్తుతిస్తూ ఉంటారు. ఆ తల్లి నామపారాయణ చేసిన మాత్రముననే సంప్రీతురాలగును. (నామ పారాయణ ప్రీత).

శ్రీమాతృ వైభవ సర్వస్వమును బ్రహ్మ, విష్ణువులు కూడ ఎరుగలేరట. వేయి తలలుండు అనంతుడును, దేవగురువగు బృహస్పతియును వర్ణింపజాలరట. గురువుల నుండి తెలిసి కొనిన కొన్ని విషయములను, ఉపనిషత్తులు, సౌందర్యలహరి, లలితా సహస్ర నామావళినుండి గ్రహించిన కొన్ని సూక్తులు ఆధారముగ ఆ భగవతి నాలో స్ఫురింపజేసిన కొన్ని విషయములను ఈ స్తోత్ర రూపముగా రచింప బూనుకొంటిని.

ఆత్మ విద్య, మహావిద్య, శ్రీవిద్య యను నామములు లలితా సహస్ర నామావళిలో కలవు. ఇవియన్నియును బ్రహ్మవిద్యకు పర్యాయపదములే. అమ్మ శ్రీవిద్యాస్వరూపిణి. ఇది అతి నిగూఢమైన విద్య. "అవిద్యానామంత స్తిమిర మిహిరద్వీపనగరీ" అని సౌందర్యలహరిలో పేర్కొనబడినది. విద్య అనగా శ్రీవిద్య, "అధ్యాత్మ విద్యా విద్యానాం" అని భగవద్గీతా వచనము. శ్రీవిద్య నెరుగనివారు అవిద్యులు. అట్టివారి అవిద్యను (అజ్ఞానమును) పోగొట్టి వారికి మిహిరద్వీపనగరమువలె (సూర్యకోటి యుండు ద్వీపము) మహోజ్జ్వల తేజస్సంపత్తితో నలరారు జ్ఞాన సంపదను కలుగజేయును ఆ జగన్మాత.

ఆ భగవతి ఓంకార పంజరములో నొప్పు పలుకుజిలుక. సాధకులు నిరంతర ప్రణవాభ్యాసము చేత ఆ తల్లి అనుగ్రహము పొందగలరు – ఉపనిషత్తులు అను పూలతోటలో తిరుగాడు కోకిల – అనగా వేదాంత సారములైన ఆ ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడిన తత్త్వము (అనగా బ్రహ్మము) ఆ తల్లియే – వేద శాస్త్రములనబడు అడవులందు సంచరించు నెమిలి. అనగా ఆ దేవియే వేద శాస్త్ర పురాణాదులలో

జగన్మాతగా బహుధా ప్రశంసింపబడినది.

సుధాసింధోర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీం (సౌందర్య లహరి)

అను శ్లోకములో శ్రీమాత యొక్క స్థితి వర్ణింపబడినది. ఆ దేవి సుధాసాగర మధ్యలో కల్పవృక్షములతో నిండిన ప్రదేశములో, కడిమిచెట్ల మధ్యనున్న మణిద్వీపములో చింతామణులతో నిర్మింపబడిన మందిరమునందు శక్తిస్వరూపమైన మంచమునందు పరమ శివుని తల్పముపై జ్ఞానస్వరూపముగా నిరతిశయానంద లహరీ రూపముగా ప్రకాశించుచుండును.

సౌందర్యలహరిలోని "మహీం మూలాధారే" అని మొదలిడు శ్లోకములో సాధకునిలోని కులపథము నందుండు ఆరు చక్రములను (మూలాధార చక్రము, మణిపూర చక్రము, స్వాధిష్ఠానచక్రము, అనాహతచక్రము, విశుద్ధచక్రము, అజ్ఞాచక్రము) దాటి సహస్రార పద్మమునందు పతియగు సదాశివునితో కలిసి ఆ తల్లి విహరించుచుండును అని తెలిజేయ బడినది.

శ్రీమాతను -- విద్యాస్వరూపిణి, జ్ఞానస్వరూపిణి, తేజోరూపిణి, కళాస్వరూపిణి, ఆనందస్వరూపిణి, నాదస్వరూపిణి, వేదస్వరూపిణి, మంగళస్వరూపిణి, శక్తిస్వరూపిణి మొదలైన వివిధ తత్త్వములుగా పేర్కొందురు. అంతర్ముఖ సమారాధ్యా, బహిర్ముఖ సుదుర్లభా అని అమ్మను అంతర్ముఖముగనే (అనగా హృదయమునందే నిలిపి) ఆరాధించినచో సులభముగ లక్ష్యము సిద్ధించును.

సౌందర్యలహరిలోని "సవిత్రీభిర్వాచాం" అని మొదలిడు శ్లోకములో -- చంద్రకాంత మణిశిలల కాంతులతో నొప్పుచు, వశిన్యాది వాగ్దేవతలు మొదలగు వారితో కూడియున్న ఆ తల్లిని ధ్యానించు సాధకుడు మహాకవులవలె మృదుమధురములైన సరస్వతీ దేవి ముఖ పద్మమునందలి ఆమోదకరమైన వాక్సంపదతో కావ్యములను రచింప సమర్థుడగును --అని పేర్కొనబడినది. ఆ విధముగనే శ్రీ మాత నన్ననుగ్రహించి ఈ స్తోత్రమును రచింపజేసినది అని ఆనందముతో కృతజ్ఞతా పూర్వకముగా సవినయముగ సుమాంజలి ఘటించుచున్నాను.

ఇట్లు - రచయిత

# సర్వమంగళా స్తోత్రము

శ్రీజననీ! జగజ్జనని! శ్రీ శివమానస రంజనీ! మహాం
భోజ వనాధివాసిని! ప్రబోధ నిధానమునై సువర్ణ వి
భ్రాజితమైన నీదు విభవమ్ము పవిత్ర నదీ ప్రవాహమై
తేజముతోడ వెల్వడె నిదే కవితాప్రియ! సర్వమంగళా! 1.

శ్రీ పరమేశ్వరీ! విబుధసేవిత పాద సరోరుహా! మణి
ద్వీప విహారిణీ! భగవతీ! నిగమాగమసార రూపిణీ!
నీ పయి భక్తిభావమున నిర్మల చిత్తమునన్ భజింతు వి
ద్యా పరిపుష్టి మా కొసగుమమ్మ! దయామయి! సర్వమంగళా! 2.

శ్రీలలితాంబికా! నిగమశీర్షచయ స్తుత తత్త్వ వైభవా!
బాలశశాంకభూషణ! సుపర్వవధూగణ వేష్టితా! కృపా
శాలిని! విశ్వపాలిని! ప్రసన్న గుణాఢ్య! సుధీవిశాలినీ!
బాల దినేశకోటి సమభాసుర రూపిణి! సర్వమంగళా! 3.

కలశపయోధి మధ్యమున కల్పమహీజ చయావృతాటవీ
స్థలిగల ద్వీపరాజమున సన్మణిమండిత మందిరమ్మునం
దలరెడు మంచెపై, శివ సమంచిత తల్పముపై వసించు నిన్
దలచి నమస్కరించెదను ధన్యతగాంచగ సర్వమంగళా! 4.

జనని! సమస్త లోకముల చల్లగ చూచుచు బ్రోచుచుండి, స
జనులకు చింతదీర్చి సుఖ శాంతులు గూర్చి, శుభమ్ములిచ్చి, స
మ్మనముల నిల్పి, ధర్మమయ మార్గములో నడిపించు నో జగ
జ్జనని! భజింతు నిన్ను శృతిసార విలాసిని! సర్వమంగళా! 5.

అంబవు నీవు భక్త హృదయాంబుజ పీఠి నలంకరించి, తే
జంబును, తత్త్వ చింతనయు, శాంతి సుఖంబులు గూర్చు చుండు ప్రే
మాంబుధి వీవు, మమ్ము కరుణామృత వీక్షణ తోడ బ్రోచి, జ
న్మాంబుధి దాటజేసి, పరమావధి గూర్పుము సర్వమంగళా! 6.

వాణివి నీవు, తామరసపాణివి నీవు, శివార్ధ గాత్రి, రు
ద్రాణివి నీవు, సర్వ శుభదాత్రివి, భక్త వరప్రదాత్రి, క
ళ్యాణివి నీవు, నీ యభయ హస్తముతో మము బ్రోవు మమ్మ! గీ
ర్వాణ గణస్తుతా! పరమ పావన భావన! సర్వమంగళా! 7.

పరమ కృపాస్పదమ్ములును, పావనముల్, మహిమాన్వితమ్ములున్
నిరుపమ శక్తిమంతములు, నీ పద నీరజరేణులంచు, నీ
చరణ పవిత్ర తామరస సన్నిధి సేవలొనర్చు చుండి, నే

పరమపద మ్మొసంగుమని ప్రార్థన సేయుదు సర్వమంగళా! 8.

వెన్నెలబోలు నీ నగవు విశ్వమునంతట శాంతి నింపు, నీ
కన్నులలో సుధారసము క్రన్నన గూర్చును సౌఖ్య సంపదల్
చిన్నిధియైన నీదు పద సీమను జేరిన ముక్తి గల్గునో
సన్నుత తత్త్వవైభవ! ప్రసన్న ముఖాంబుజ! సర్వమంగళా! 9.

సలలిత రాగ చంద్రికల సర్వ జగమ్ముల కాంతి నింపుచున్
దొలచుచు దుష్ట శక్తులను దుఃఖము బాపుచు నెమ్మనమ్మునన్
గొలిచిన వారికిన్ సుఖము గూర్చు సుధాకర శేఖరీ! మహో
జ్జ్వల శుభగాత్రి! మా వెతల బాపవె చిన్మయి! సర్వమంగళా! 10.

అమ్మవు సర్వ లోకముల కాదిమ శక్తివి, భక్త కోటి డెం
దమ్ములలో జెలంగుచును స్థైర్యము ధైర్యము గూర్చి శాంతి సౌ
ఖ్యమ్ములొసంగు నిన్ను మనసా వచసా శిరసా భజింతు మా
యమ్మ! జయమ్ము నిమ్ము సదయాహృదయాంబుజ! సర్వమంగళా! 11.

హరిహరులేని తావక మహామహిమమ్ము నెరుంగరంట, మా
తరమె యెరుంగగా జనని! తావక తత్త్వ విశేష సంపదన్
శరణము మాకు నీ చరణ సారస యుగ్మమటంచు నీ పదాం
బురుహము చేరి మ్రొక్కు మము బ్రోవుము నిత్యము సర్వమంగళా! 12.

ధ్యానమొనర్తు నీదు పద తామరసమ్ముల నెమ్మనమ్మునన్
గానమొనర్తు నీ పరమ కారుణిక ప్రథితాత్మ తత్త్వమున్
పానమొనర్తు తావక కృపారస సార విశేషమాదృతిన్
దీన జనావనా! భగవతీ! మము బ్రోవుము సర్వమంగళా! 13.

అమ్మ! కళాప్రపూర్ణ! భవదంచిత మంత్రము మన్మనోంబుజా
తమ్మున నే జపించుచును తన్మహిమంబు పథంబు జూపగా
సమ్మతి యోగ మార్గమున సాగుచు చేరుదు, నిత్య శాంతి సౌ
ఖ్యమ్ములొసంగు నీదు చరణాంబురుహమ్ములు సర్వమంగళా! 14.

మాయలలోన చిక్కితిని, మంచియు చెడ్డ నెరుంగనైతి నీ
సాయముగోరి నీదు పద సారస యుగ్మము నే భజించెదన్
మాయలు జీల్చి ధర్మమయ మార్గమునందున మమ్ము చేర్చుచున్
శ్రేయము గూర్చుమమ్మ! రసశేవధి! శ్రీనిధి! సర్వమంగళా! 15.

చిలుకగ మంత్రరాజమను చెన్నగు పంజరమందు నొప్పుచున్
బలుకుచు సర్వదా సకల భద్రములన్ సమగూర్చు సూక్తులన్
గొలిచిన భక్త బృందములకున్ సుఖ శాంతు లనుగ్రహించు నో

లలిత! భవాని! నీ పదములన్ గొలుతున్ మది సర్వమంగళా! 16.

జ్ఞానఫలాన్వితమ్ములగు కల్పమహీజము లొప్పు చుండు ను
ద్యాన వనమ్ములంట నిగమాంతము లందనురక్తితో సదా
గానము సేయు కోకిలముగా నుతికెక్కిన తల్లి! భక్తితో
ధ్యానమొనర్తు నీదు పద తామరసమ్ముల సర్వమంగళా! 17.

ఆగమ శాస్త్ర భూరుహ చయాన్వితమౌ విపినాంతరమ్మునన్
బాగుగ నృత్యముల్ సలుపు బర్హివతంసమ! విశ్వమంతటన్
మ్రోగుచు నీదు మంజురవముల్ శ్రితకోటుల నుద్ధరించు, నీ
వే గతియంచు నీ శరణు వేడుచు నుంటిని సర్వమంగళా! 18.

చలనములేక యజ్ఞులయి జాడ్యముతో పడియుండు వారికిన్
సలలిత రీతి జ్ఞానసుమ సౌరభముల్ ప్రసరింపజేయుచున్
దొలగగ జేసి జాడ్యమును తోరముగా తగు చేతనత్వమున్
గలుగగజేయు నిన్ గొలుతు జ్ఞానరసాంబుధి! సర్వమంగళా! 19.

భవమను సాగరానబడి బాధల నొందుచునున్న వారలన్
సువిధి సముద్ధరింప హరి సూకర రూపుని దంష్ట్రయుగ్మపై
భవమున నెత్తి భద్రముగ పారము జేర్చెడు నిన్ను గొల్చెదన్
ప్రవిమల భక్తి భావమున భక్త జనావన! సర్వమంగళా! 20.

జ్ఞానవిహీనులై పథము గానక మాయల మ్రగ్గువారికిన్
భాను సహస్రమండల విభాసుర కాంతులతో వెలుంగుచున్
జ్ఞానమొసంగి యోగ విలసత్పథ మొప్పుగ జూపు నిన్ను స
న్మానముతో భజించెదను మంగళదాయిని! సర్వ మంగళా! 21.

ఆపదలెల్ల బాయును, భయమ్ములు దీరును, నెమ్మనమ్మునన్
నీ పదపద్మ యుగ్మమును నిశ్చల భక్తిమెయిన్ భజించుచో
శ్రీ పరమేశ్వరీ! సకల సిద్ధులు చేకురు నో లసన్మణి
ద్వీప నివాసినీ! భగవతీ! శివభామిని! సర్వమంగళా! 22.

పరిపరి రీతులన్ బెరిగి బంధములెన్నియొ పెట్టు చిక్కులన్
ధరణిని తల్లిదండ్రులును, దారయు, బిడ్డలు నాస్తి పాస్తులున్
పరిజనమంచు, రాగమను పాశమె బంధములన్ సృజించు, నీ
కరుణయె త్రుంచు బంధములు జ్ఞాన సుధామయి! సర్వమంగళా! 23.

మత్తగజాల పోలికి క్షమాస్థలిపై దిరుగాడుచుండు దు
శ్చిత్తుల నెల్ల నీ వశము చేసెడు నంకుశమొక్క క్రోధమే
మత్తును చిత్తు జేసి క్రమ మార్గమునందున బెట్టు దేవి! మ

చ్చిత్త నివాసినీ! నిను భజింతును నిత్యము సర్వమంగళా! 24.

తాండవకేళి సల్పుచును త్ర్యక్షుడు, లాస్యముతోడ నీవు, బ్ర
హ్మాండము లన్నిటిన్ రసమయమ్ముగ జేయుచు నుండ, ప్రేమతో
నిండిన మీ కటాక్షముల నేను దలంచుచు భక్తితోడ మీ
యండను జేరి పొందెద సమస్త సుఖమ్ములు సర్వమంగళా! 25.

అన్నము తిన యప్పుడును, హాయిగ నిద్దుర పోవు నప్పుడున్
చెన్నగు భోగ భాగ్యముల జిత్తము రంజిలుచుండు నప్పుడున్
సన్నుత యోగసాధనల స్వాంతము శాంతిని జెందు నప్డు, లో
నున్నది నీదు తత్త్వమను నూహ జెలంగుదు సర్వమంగళా! 26.

పలుకులు నీవి, నా యెదను భావము నీయది, సత్కవిత్వమం
దలరు రసమ్ము నీయది, సమంచితమౌ యనుభూతి నీది, ని
ర్మలమగు భక్తిభావమున మానస సారసమందు నిన్ను నే
దలచిన యంతనే ఫలము తథ్యము వాఙ్మయి!సర్వమంగళా! 27.

కామిత సత్ఫలమ్ములిడు కల్ప మహీజమొ, కామధేనువో,
ఏ మణిరాజమో యనుచు నెంచగ నేరను నిన్ను నెన్నడున్
సేమము గూర్చుచుండి, మది జింతల దీర్చుచు, శాంతిసౌఖ్యముల్
ప్రేముడి నిచ్చు నిన్ దలతు వేల్పుల వేల్పుగ సర్వమంగళా! 28.

అమ్మ! భవత్పదాంబుజ సమర్చన నిత్యమొనర్చు నట్టి వా
రిమ్ముగ సత్కవీశ్వరులకే తలమానికమట్లు నవ్య కా
వ్యమ్ముల శబ్ద, భావ, రసబంధుర భంగుల జేయ గల్గుచున్
సమ్మతి సాహితీప్రియుల సత్కృతి గాంతురు సర్వమంగళా! 29.

వెన్నెల మించు నీ కనుల వెల్గులు భావన సేయు వారు వి
ద్వన్నుత వాక్ప్రశస్తి మయ భాగ్య పరంపరలొంది జ్ఞాన సం
పన్నులరై చెలంగి భవ బంధ విముక్తులు నౌట తథ్యమో
సన్నుత సద్గుణ ప్రకర! సర్వ కళానిధి! సర్వమంగళా! 30.

తేనెల మించి యెంతయును తీయగ నొప్పెడు నీదు పల్కులన్
వీనుల విందు జేయుమని వేడుచునుండిన నన్ను బ్రోచుచున్
జ్ఞాన సుధా రసాన్వితముగా శుభ వాక్పటిమమ్ము నీయుమా
గాన వినోదినీ! విబుధ కామిత దాయిని! సర్వమంగళా! 31.

ఓ పరమేశ్వరీ! సకల యోగ పథాంతరచారిణీ! మణి
ద్వీప నివాసినీ! పరమ తేజముతో నలరారు దేవి! చి
ద్రూపిణి! నీదు దర్శనముతో జరితార్థుడనైతి, నీ కృపన్

దాపములున్ నశించినవి, త్ర్యక్ష కుటుంబిని! సర్వమంగళా! 32.

పావనమైన నీదు పదపద్మ యుగమ్మును సాదరాన సం
భావన చేయుచున్ మది సువర్ణ సమన్విత మంత్రరాజమున్
శ్రీవిధి నే జపించెదను చిన్మయరూపిణి! మోక్షదాత్రి! నీ
సేవలు నాదు శక్తిమెయి చేయుదు నిత్యము సర్వమంగళా! 33.

వరములు పెక్కులొంది, బలవంతులమంచు మదించి కండ కా
వరమున గెల్చి దేవతల బాధలు పెట్టుచునున్న దైత్య కుం
జరముల దంభ విక్రమము సర్వము నాశమొనర్చి దుష్టసం
హరణ మొనర్చినట్టి నిను బ్రార్థన సేయుదు సర్వమంగళా! 34.

కన్నులు నీవు విప్పునెడ కాంతిమయమ్ముగ సర్వ లోకముల్
చెన్నుగ రూపు దిద్దుకొను చిత్ర విచిత్ర చరాచరాళితో
గన్నులు మూయుచో లయము గల్గు జగమ్ముల కెల్ల జ్ఞాన సం
పన్నమొనర్చు నీదు మహిమమ్ము జగమ్ముల సర్వమంగళా! 35.

మాతవు మన్మనోంబురుహ మంగళధామ నివాసినీ! సదా
భూత చయమ్ము నందు నతి పుష్కలసారము గూర్చుచుండు ప్ర
ఖ్యాత రసాంబురాశివి, నయమ్మున గొల్తును నిన్నునో జగ
న్మాత! కటాక్ష వీక్షణల నన్ గృపజూడుము సర్వమంగళా! 36.

అమ్మను రెండు వర్ణముల కద్భుత రూపము, భావ సౌకుమా
ర్యమ్మును గల్గె నీదు మహిమాతిశయమ్మున నందు నాది వ
ర్ణమ్ము సృజించు లోకముల, రంజిలజేయు, లయింపజేయు, నం
త్యమ్ము ననూహ్య శక్తిమయమై వెలుగొందును సర్వమంగళా! 37.

అమ్మను రెండు వర్ణముల యందలి యద్భుత తత్త్వ వైభవం
బిమ్ముగ బేర్కొనందరమె? యేరికినేనియు, నిండు ప్రేమలో
నమ్మధురానుభూతియును, నయ్యనుబంధము, నమ్మహత్త్వమో
యమ్మరొ! మే మెరుంగలమా! జగదీశ్వరి! సర్వమంగళా! 38.

ఆరు సరోరుహమ్ములట, అద్భుత కాంతిమయమ్ములంట, అ
య్యారిటి నుండి యొప్పుగ ప్రయాణము చేసిన సాధకుల్ సహ
స్రారముచేరి యందు మిము నంచిత లీలల దేలు మంగళా
కారుల నాదిదంపతుల గాంచి తరింతురు సర్వమంగళా! 39.

శివునకు నీకు భేదము నచింత్యము నిద్దరి రూపురేకలన్
వివిధ విభూషణమ్ములను భేదమొకింతయు గానరాదు, మీ
కవయె విశిష్టమై తనరు, కన్పడు దానవు నీవె తల్లి! యా

భవుడు హృదంతరాళమున భాసిలు నాత్మగ సర్వమంగళా! 40.

ప్రకృతియు, పూరుషుండు నను భావ సమన్వయ వృత్తి చేతనే
ప్రకటిత భావతత్త్వముల భాసిలుచుందురు మీరు నిత్యమున్
సుకృతవశాన మిమ్ము మది జూచి తరింతురు సజ్జనాళి, నే
నకలుష వృత్తి మీ పదము లర్చన చేయుదు సర్వమంగళా! 41.

వాక్కును భావమట్లు ననుబంధము గల్గుచు తల్లిదండ్రులై
మక్కువ ముజ్జగంబులను మన్నన లొందెడి మిమ్ము భక్తితో
మ్రొక్కిన యంత నా కవనమున్ వెలుగొందెను వాగ్విభూతితో
చక్కగ మీ మహత్త్వమును సన్నుతి చేయుచు సర్వమంగళా! 42.

సారకథాభిరామమయి, సర్వ శుభాస్పద దీప్తితో, నలం
కారచయాన్వితమ్మునయి, జ్ఞాన సుధారసపూర్ణమై, శుభా
కార విశేష యుక్తమయి, కమ్ర సువర్ణ సుశోభితమ్మునై
నా రచనమ్ము నీదు కరుణన్ వెలుగొందును సర్వమంగళా! 43.

నీ దరహాస చంద్రికల నేను స్మరించుచు పొంగుచుండగా
నాదు మనస్సరోవరమునన్ సరసోత్పల రాజి యొప్పె న
త్యాదృతి నిన్ను గొల్చుటకు నల్లితి నుత్పలమాల లమ్మ! స
మ్మోదము తోడ నా సుకృతమున్ దిలకింపుము సర్వమంగళా! 44.

సరి మరి లేవు లేవనుచు చంపకమాలలె వర్ణ రూప గం
ధ రుచుల మేటియంచు నివె తద్దయు భక్తిగుణమ్ము తోడ ని
త్తరి సమకూర్చినాడ కవితారస మోదిని! ఈ సరాలు నీ
దరి బహు శోభలొందుచును ధన్యత గాంచుత! సర్వమంగళా! 45.

ఆయుధమేల నీకు? నఖిలాండ చయావన దక్ష! సర్వ భ
ద్రాయిత మూర్తివైన నిను ధైర్యముగా నెదిరించి నిల్చునే?
ఏ యరివీరుడేనియును, నెట్టన నిల్చిన, సంగరమ్ములో
బాయడె ప్రాణముల్? విజయ వైభవ రాజిత! సర్వమంగళా! 46.

నాస్తి భయమ్ము, భ్రాంతియును, నాస్తి విచారము దుర్వికారమున్
నాస్తి విరోధి షట్కమును, నాస్త్యవివేక మహాంధకారమున్
నాస్తి విభేద భావమును, నా హృదయంబున నిన్ను గొల్తునో
ప్రస్తుత వైభవాన్విత! సుపర్వ సుపూజిత! సర్వమంగళా! 47.

చిత్రము కాదు నా హృదయ సీమ వసించుచు నుండు నీకు, నా
యాత్రము తెల్లమేకద, నయమ్మున నీ దరి మ్రొక్కుచుండ, నీ
పుత్రుని వోలె జూచి నను బ్రోవుము, భవ్య పదమ్ము నిమ్ము, ఓ

గోత్రసముద్భవా! సుగుణకోవిద సంస్తుత! సర్వమంగళా! 48.

తొలుదొలుతన్ మహీజనులు దుర్గతులొందుచు జ్ఞానహీనులై
నలుగుచునుండ వారలకు జ్ఞానము నిమ్ముగ బోధసేయగా
దలచిన నీదు కోర్కెమెయి త్ర్యంబకు డాది జగద్గురుండునై
సలిపెను జ్ఞానబోధ నరజాతికి నిమ్ముగ సర్వమంగళా! 49.

శక్తివి నీవు, సర్వవిధ శక్తులు నీదు ననేక రూపముల్
శక్తియె లేక యించుకయు స్పందన చేయగలాడె శంభుడున్
శక్తిని గొల్చి దేవతలు సర్వ విధుల్ పొనరింతు రొప్పుగా
శక్తి కొలంది నిన్ గొలుతు సద్గతి గూర్పుము సర్వమంగళా! 50.

దనుజుల గెల్చి వేల్పులు ముదమ్మున బొంగుచునుండ, జాతవే
దునకును మాతరిశ్వునకు దోప నహంకృతి యా పరిస్థితిన్
మును సరిదిద్దితీవు కద! పుత్రులు విజ్ఞత కోలుపోవ, క్ర
న్నన సరిచేయదే జనని! జ్ఞానరసాంబుధి! సర్వమంగళా! 51.

మదమున నీల్గు వారలకు మన్నును మిన్నును గానవచ్చునే?
ఎదురుగ నున్న నిన్ దెలిసిరే మును వహ్నియు మాతరిశ్వుడున్?
సదమల చిత్తుడై కనడె శక్రుడు? హైమవతీ? నినున్ శుభ
ప్రద సుగుణోజ్జ్వలా! సకల భక్త జనావన! సర్వమంగళా! 52.

మనమొక ఇక్షుచాపమది మాయల చేయుచు శబ్ద ముఖ్య పం
చనిశిత బాణ రూప విలసద్విషయమ్ముల నింద్రియాలపై
ఘనముగ నాటజేయుచు వికారము గూర్చును, తత్ప్రభావ మొ
య్యన నడగించు జ్ఞానమిడుమా భువనేశ్వరి! సర్వమంగళా! 53.

అక్షర రూపవీవు, సకలాక్షరముల్ మహిమాన్వితాలు, ప్ర
త్యక్షరమున్ జపార్హమయి యద్భుత సిద్ధులు గూర్చుచుండు, చి
చ్చక్షులతో గనుంగొనిన సర్వము బ్రహ్మమటంచు దోచు నో
త్ర్యక్ష పతివ్రతా! సురనుతా! నిను గొల్తును సర్వమంగళా! 54.

ఈశ్వరి! నీ మహామహిమ మెవ్వరికేని నెరుంగ నౌనె? మా
హేశ్వరి! బ్రహ్మ విష్ణు దివిజేశులు నిన్ను స్తుతింప జాలిరే?
విశ్వము నీ కటాక్ష శుభ వీక్షణచే వెలుగొందు, రాజరా
జేశ్వరి! రాజ్యదాయిని! భజింతును నిన్ మది సర్వమంగళా! 55.

చిలుక యొకర్తు నీ కరము చేరి సపర్యలు చేయు నిత్యమున్
బలుకుచు వేద మంత్రములు పావన నామము లుచ్చరించు, నా
చిలుకను మించి సేవలను చేసెడు భాగ్యము నా కొసంగుమా

జలరుహసంభవాది సుర సన్నుత వైభవ! సర్వమంగళా! 56.

దుర్గవు నీవు త్రుంచెదవు దుర్జన కోటిని రౌద్రరూపిణీ!
భర్గ కుటుంబినీ! జనని! భద్రము కూర్తువు ముజ్జగాలకున్
దుర్గతులెల్ల బాపి పరితోష మొసంగుము నాకు మద్ధృదం
తర్గత వైరిజాలమును నాశమొనర్పుము సర్వమంగళా! 57.

ప్రమథ గణస్తుతా! గిరిశ భామిని! నీ గుణ సౌరభమ్ము లో
కముల ప్రవిస్తరించుచు సుఖమ్ములు గూర్చును జీవకోటికిన్
భ్రమలను వీడి జీవులును బాగుగ యోగ పథమ్ము బూని నీ
విమల పదమ్ము జేరెదరు విశ్రుత వైభవ! సర్వమంగళా! 58.

నిన్ను దలంచి భక్తిమెయి నీ దశ నామము లుచ్చరించుచో
నెన్నగరాని సంపదల నిచ్చెదవందురు, వేయి నామముల్
చెన్నుగ పల్క తత్ఫలము చెప్పగ నేల? భవాబ్ధి తీరమున్
క్రన్నన జేర్చి వారికి సుఖమ్ములు గూర్తువు సర్వమంగళా! 59.

పురములనన్ శరీరములు, మూడు శరీరములన్ వసించు సుం
దరివట మూడవస్థల సదా యలరారుచు జీవులందు సం
బరమును నింపుచుండు నిను భావన సేసిన యట్టివారికిన్
పరమపద మ్మొసంగెదవు భవ్య ఫలప్రద! సర్వమంగళా! 60.

అమ్మరొ! నీ సమాశ్రయము నందిన సర్వ చరాచరా లనూ
హ్యమ్మగు శక్తులొందును కదమ్మ! మహేశుడు మ్రింగె నంట ధై
ర్యమ్ముగ కాలకూటమన నయ్యది నీ చెవి కమ్మలో మహ
త్వమ్మె, మహో మహాద్భుతము, త్ర్యంబక మోహిని! సర్వమంగళా! 61.

హరునకు నీకు నెట్టి ప్రళయంబున నైన విపత్తు రాదు, సం
బరమున నోల లాడెదరు బాగగు తాండవకేళిలోన, మీ
రిరువురె పెండి లోకముల నెల్ల సృజింపగ బూనుకొందు ర
బ్బురములు మీ విధానము లమోఘ ఫలప్రద! సర్వమంగళా! 62.

ఆరు సరోరుహమ్ముల ప్రయాణము చేయ నుపక్రమించి, యా
ధారము నుండి సక్రమ విధానమునన్ జనుచుండి యా సహ
స్రారము చేరి యందు ముదమార సదాశివు గూడి యుండు నిన్
సారమతిన్ గనుంగొని ప్రశాంతిని బొందుదు సర్వమంగళా! 63.

మానస సార హీనులగు మానవులెందరొ నీ కృపన్ గనన్
జ్ఞాన విశిష్టులైరి మును క్రన్నన మూగ యొకండు నింపుగా
గానము సేసె స్తోత్రములు కమ్మని కావ్యములన్ రచించె న

మ్మా! నను నెట్లు ప్రోచెదవొ? మంజుల భాషిణి! సర్వమంగళా! 64.

అనలుడు కూర్చు చేతనము, నర్కుడు నింపును జ్ఞాన కాంతి, హో
యినొసగు చందురుండు జనులెల్లరిలో నలరారుచుండి యా
యనల దినేశ చంద్రులకు నంచిత తేజము, శక్తి నిచ్చు నీ
యనుపమ తత్త్వ వైభవము నాత్మ దలంతును సర్వమంగళా! 65.

జ్యోతులనేకముల్ కలవు సూర్య శశాంక ముఖమ్ములౌచు, నా
జ్యోతుల కెల్ల మూలమగు జ్యోతివి నీవె కదమ్మ! ఓ పరం
జ్యోతి! ముముక్షు చిత్తముల జ్యోతులు నింపెడు నిన్నుగొల్తు సం
ప్రీతి కృతార్థ జేయగదవే నను శాంకరి! సర్వమంగళా! 66.

క్షరములు పంచభూతమయ సర్వ జగమ్ములు, నీదు తత్త్వ మ
క్షరము, సమస్త జీవులకు శాశ్వత సౌఖ్యములిచ్చు నట్టి నీ
పరమ పవిత్ర పాదయుగ భావన చేయుచు నుందునమ్మ! అ
క్షర విభవ ప్రదాత్రి! శితికంధర గేహిని! సర్వమంగళా! 67.

వరము మనుష్యకోటులకు వాక్కను సంపద, వాఙ్మయమ్ములై
కరము పెలుంగు లోకములు జ్ఞానముతో నభివృద్ధి చెందుచున్
పరమ పవిత్ర భావమున వాగ్వరివస్య నొనర్చు వారికిన్
పరమపదమ్మొసంగు నిను ప్రార్థన చేయుదు సర్వమంగళా! 68.

విద్య లనేకముల్ కలవు విశ్వమునందున నెంచి చూడ, శ్రీ
విద్యయె విద్య, యన్యములు విద్యలు కావట, నీటి మూటలే
విద్యయె నీ స్వరూపమట, విద్యయె చేర్చును మోక్షధామమున్
విద్య యనుగ్రహింపుమని వేడుదు నిన్ మది సర్వమంగళా! 69.

మాత్రలు మూడు చేర్చిన "ఉమా" యగు, వేరొక రీతి గూర్చ నా
మాత్రలె "ఓం" మగున్ ప్రణవ మంత్రము నందధిదైవమీవె, యా
చిత్రమెబో శివాశివుల స్నిగ్ధ సమైక్యము వెల్లడించు నో
గోత్ర సముద్భవా! దనుజ కుంజర సింహమ! సర్వమంగళా! 70.

వేదమపౌరుషేయమట, వేదమె నేత్రము పూరుషాళికిన్
వేదశిరమ్ములే సకల విద్యల సారములై వెలుంగు, నో
వేదచయస్తుతా! పరమ విద్యను నాకు ననుగ్రహింపుమా
ఆదిమశక్తి! నీదు చరణాబ్జము గొల్తును సర్వమంగళా! 71.

సంపదలెన్నియుండినను జన్మము సార్థకమౌనొకో సుధీ
సంపద లేనిచో నితర సంపద లెల్లను వ్యర్థముల్ కదా!
యింపగు యోగ మార్గమున సేగుచు నీ పద మాశ్రయింప, సి

ద్ధింపవె శాంతిసౌఖ్యములు, దేవ గణార్చిత! సర్వమంగళా! 72.

నాటకవేది విశ్వమని నాదొక పాత్ర యటంచు కొద్దిగా
పాటవమున్నచో బ్రతుకవచ్చు నటంచును వింటి గాని, యీ
బూటకమంతయున్ విడిచి, పొల్పగు జ్ఞానము నాశ్రయించి, ప
ద్మాటవి జొచ్చి నీదు చరణాబ్జము గొల్తును సర్వమంగళా! 73.

నటనము క్రొత్తకాదు మును నాటక రంగములందు నేను, నా
పటిమను జూపినాడ బహు పాత్రలలో, విసువొందినాడ, ని
ప్పటికిక చాలు, నీ చరణ పంకజ సీమను జేరనెంతు, న
క్కటికముజూపి ప్రోవగదె కంజదళేక్షణ! సర్వమంగళా! 74.

నీ పద కాంతి పుంజములు నింపును పెల్లుగ విశ్వమంతటన్
నీ పద కింకిణీ ధ్వనులు నిండు జగమ్ముల వేదరాశియై
నీ పద పద్మ సౌరభము నిత్య సుఖమ్ములొసంగు, భక్తితో
నీ పదమాశ్రయింతు జననీ! కరుణామయి! సర్వమంగళా! 75.

మనమున భక్తి పొంగునెడ మంత్రము, తంత్రము, యంత్రమేల? హృ
ద్వనమున జ్ఞానసంపదలు భాసిలు వేళల కర్మలేల? నీ
యనుపమ రాగ సంపదల నందిన వేరొక యోగ మేల? నో
వనరుహ సంభవాది సురవందిత వైభవ! సర్వమంగళా! 76.

అనిశము నీవు మా పయి కృపామృతమున్ గురిపించుచుండ, వా
నను దడియంగ నొల్లక మనమ్మున సంశయ వృత్తినిండ, మా
యను గొడుగంచు బట్టి తిరుగాడుచు నుంటిని, మాయ జీల్చి నిన్
గనుగొన జాలు భాగ్యమిడి కావగ వేడుదు సర్వమంగళా! 77.

పానమొనర్చి భక్తిరస పాయసమున్ ముదమార చిత్త సం
ధాన మొనర్చి నీదు పద తామరసమ్ముల యందు భక్తి సో
పానములెక్కి చేరెదను భాసుర లక్ష్యము, నీ మహత్త్వమున్
గానమొనర్తునో జనని! కామితదాయిని! సర్వమంగళా! 78.

అందమె నీదు చందమట, అందమె అందరియందు గూర్చు నా
నందము, స్పర్శ రూప రస నాద సుగంధములిచ్చు భౌతికా
నందము, నీదు పాద నలినమ్ముల సేవలొసంగు శాశ్వతా
నందము, నీ పదాబ్జములు నమ్మి భజింతును సర్వమంగళా! 79.

హరి నిను నాశ్రయించి వివిధాకృతులన్ మును బొంది, దుష్ట సం
హరణము, సాధు రక్షణము నంచిత రీతి నొనర్చె, నొక్క సుం
దరియయి చంద్రశేఖరు మనమ్ము కలంచెను, నీ కటాక్షమే

సురుచిర వైభవమ్ములును శోభలు గూర్చును సర్వమంగళా! 80.

మాత! జగత్త్రయీ భువనమాత! సురక్షిత సర్వదేవతా
వ్రాత! చిదగ్నిజాత! మునివర్య సువందిత నైక సద్గుణ
వ్రాత! సమస్త దుష్టజన వారణ బృంద మృగాధినేత! సం
ప్రీత మనోంబుజాత! పరమేశ పతివ్రత! సర్వమంగళా! 81.

నీ పద పద్మరేణువులు నిత్య శుభప్రదముల్ మనోన్మనీ!
పాపటయందు కుంకుమగ భాసిలుచుండును వేదమాతకున్
శ్రీపరమేశ్వరీ! హరి విరించి మహేశులు తత్ప్రభావ సం
దీపిత చిత్తులై విధులు నిత్యమొనర్తురు సర్వమంగళా! 82.

చనుగవయంట సూర్యుడును, చంద్రుడు నీకు జగమ్ములన్నిటన్
దనరగ కాంతి నింపుచును తద్దయు గూర్చుచు చేతనత్వమున్
దునుముచు మాయలన్ బ్రజకు దుష్టిని పుష్టిని గూర్చుచుండు నో
జననిరొ! తత్ప్రభావమును సంస్తుతి సేయుదు సర్వమంగళా! 83.

తనువులు, సంపదల్, సుతులు, దారలు శాశ్వతమంచు భ్రాంతితో
దినదినమున్ శ్రమించుచును దిక్కులు తోచక స్రుక్కనేల? ఈ
ధన జన ముఖ్య సంపదలు తథ్యము మాయును రేపుమాపులో
నిను మది గొల్వగా గలుగు నిత్య సుఖమ్ములు సర్వమంగళా! 84.

సదమల భక్తి నీదు పద సారస సేవలొనర్చు వారికిన్
హృదయములో తమః పటలమెల్లను జీల్చుచు కాంతినింపు నీ
పద నఖ దీధితుల్ పరమ పావనముల్ పరమార్థ వైభవా
స్పదములు తల్లి! నీదు పద సన్నిధి మ్రొక్కుదు సర్వమంగళా! 85.

అందరిలోన నుండునది ఆత్మయె యంచును, ఆత్మ సచ్చిదా
నందమయమ్మటంచు మది నమ్ముచు నిత్యము నాత్మ తత్త్వమే
యందరిలోన జూచెడు మహాత్ములు నీ కృప గాంతురంట, ఆ
నద రసాంబుధీ! దివిజ నాయక సంస్తుత! సర్వమంగళా! 86.

స్థిరముగ నాదు మానసము ధ్యేయమునందున నిల్వదయ్యె, చె
చ్చెర తిరుగాడు నెల్లెడల చింతనలెన్నియొ చేయుచుండు, స
త్వరమది నీ పదాంబురుహ పావన సీమను నిల్వజేయుమా
సరసిజ సంభవాది సురసన్నుతవైభవ! సర్వమంగళా! 87.

కలవు త్రికూటముల్ వరుస కాదిగ, హాదిగ, సాదిగా మహా
ఫలము నొసంగు పంచదశ వర్ణసమన్విత మంత్రమందు, ని
ర్మల హృదయాన నప్పరమ మంత్రము నేను జపింతు నో సువ

ర్ణ లలితగాత్రి! మంత్రమయి! నాదవినోదిని! సర్వమంగళా! 88.

మానవ జన్మ దుర్లభము, మానవు లాత్మ వివేకవంతులై
పూనుచు జ్ఞానమార్గము, ముముక్షువులై సుఫలమ్ములొందు టెం
తేని సమంజసమ్ము నిది యేమి యెరుంగని జ్ఞానహీనులన్
దీనుల దీర్చి దిద్ది సుగతిన్ నడిపింపుము సర్వమంగళా! 89.

ప్రవిమల భక్తితోడ నవరాత్ర పవిత్ర మహోత్సవాలలో
వివిధ విశిష్ట రీతులగు వేడుక గొల్పెడు నృత్యగాన పై
భవముల చిత్ర వేషముల భక్తులు నిన్ను భజింతురో, సదా
శివ వనితా! కళాద్భుత విశేష వినోదిని! సర్వమంగళా! 90.

నీవు రస స్వరూపిణివి, నీ దరహాస వికాస చంద్రికల్
భావన సేసి తద్రసము పానమొనర్తు చకోరకమ్మునై
శ్రీవిధి తత్ప్రభావమున చిత్సుఖ యోగములొంద గోరుదున్
దేవగణార్చితా! భగవతీ! నను బ్రోవుము సర్వమంగళా! 91.

అమ్మ! భవాని! పద్యముల నల్లెడు వేళ కవిత్వ తత్త్వ మం
దమ్ముల జిల్కుచుండ శుభదమ్మగు భావము, శ్రావ్యమైన నా
దమ్మును, తేనెలొల్కెడు పదమ్ములు, నిన్నలరింప జేయు చం
దమ్ము ననుగ్రహింపుము ముదమ్ము జెలంగగ సర్వమంగళా! 92.

ఒడినను జేర్చి నేర్పితివి యొప్పగు సుద్దులు, ముద్దు పల్కులున్
బడుల ననేక విద్యలను బాగుగ నేర్పితివమ్మ ప్రేమతో
నడుగక యిచ్చుచుందు వఖిలార్థములయ్యును వత్స యట్లు నే
నడుగుచు నుంటినమ్మ! పరమార్థము నీయుము సర్వమంగళా! 93.

నాదము నీ స్వరూపమట, నాదమునుండి సముద్భవించె పృ
థ్వ్యాదిని పంచ భూతములు, నాపయి తద్విషయమ్ములెల్ల నో
ఆదిమ శక్తి! నీవె జగదంబవు దేవగణమ్ములెల్ల నిన్
సాదృతి గొల్చి వారి విధులెల్ల నొనర్తురు సర్వమంగళా! 94.

ముచ్చట యయ్యు జీవితము బుద్బుద తుల్యము మూడు నాళ్ళలో
ముచ్చటలెల్ల మాయునట, మోహము వీడుచు జ్ఞానమార్గమం
దచ్చముగా చరించుట సమంచిత యోగము కూర్చునంట, నే
నిచ్చలు నాశ్రయించెదను నీ పద పద్మము సర్వమంగళా! 95

మరువగనీయవద్దు నిను మాటికి మాటికి నెమ్మనమ్మునన్
స్మరణము కీర్తనమ్ము పదసారస సేవయు ధ్యానమో నిరం
తరమును చేయు యోగమిడి దాసుని నన్ను ననుగ్రహింపుమా

పరమ దయానిధీ! గిరిశ వామ శరీరిణి! సర్వమంగళా! 96.

అమ్మరొ! నీ కృపన్ గని మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్
సమ్మతి పొందుచుందురట సాధకు లవ్విధి నేను నీదు పా
దమ్ములు నమ్మి కొల్తును ముదమ్మున నన్ను ననుగ్రహించి, మా
యమ్మ! మహాఫలమ్మిడి కృతార్థుని జేయుము సర్వమంగళా! 97.

భయము లనేక రూపములు స్వాంతములన్ కలగుండుపెట్టు, సం
శయమదియేల? నైజమది సర్వజనాళికి, నీ పదమ్ములన్
నయముగ గొల్చుచుండ భయ నాశనమున్ భవ నాశనమ్ము ని
శ్చయముగ గల్గు మద్హృదయ సారస వాసిని సర్వమంగళా! 98.

నా మదిలో పవిత్రమగు నాదము మోదము గూర్చుచుండు, నీ
నామ జపమ్ము సంతతము నాలుకపై తనరారుచుండు, నీ
ప్రేమమయ స్వరూపమును విందొనరించును కన్నుదోయికిన్
సోమకళాధరీ! త్రిపుర సుందరి! చిన్మయి! సర్వమంగళా! 99.

గుణములు మూడు డెందముల కోర్కెలు రేపుచు పెంచు బంధముల్
గుణములు మాయచేసి భవ కూపమునన్ బడద్రోయు జీవులన్
గుణరహితాంతరంగమున కూరిమి నాత్మను గాంచవచ్చు నో
ప్రణవమయీ! ముముక్షు జన పాలిని! శాంభవి! సర్వమంగళా! 100.

ఓ పరమేశ్వరీ! శుభ గుణోజ్జ్వల దీప చయమ్ముతో మణి
ద్వీపము బోలు నా హృదయ దేశము నీకు నివాసయోగ్య మ
మ్మా! పరివార యుక్తముగ హాయిగ నందు వసించు చుండుమా
నీ పద పద్మ యుగ్మమును నెమ్మది గొల్తును సర్వమంగళా! 101.

పలుకుల చిల్కపై ప్రణవ పంజరమందు వసించు తల్లి! ని
ర్మలము సువర్ణయుక్తమగు మామక మానస పంజరమ్మునం
దలరుచు నుండుమమ్మ! నిను నంచిత రీతి భజింతు నమ్మ! ని
స్తుల శుభ లక్షణా! త్రిపుర సుందరి! వాఙ్మయి సర్వమంగళా! 102.

అమ్మరొ! అన్నపూర్ణ! సదయా హృదయాంబుజ! జీవకోటికిన్
కమ్మని యోగిరమ్ము నిడి కంటికి రెప్పల వోలె కాచు దై
వమ్మవు నీవు నిన్ దలచి నంతనె యక్షయ పాత్ర నిచ్చి భ
ద్రమ్ముల గూర్చు చుందువు సదాశివ భామిని! సర్వమంగళా! 103.

అక్షియుగమ్ము నుండి కరుణామృత వీచిక లుప్పతిల్లు నీ
యక్షర రూప వైభవము నాత్మ గనుంగొన గోరుచుంటి, చి
చ్చక్షులు నా కొసంగి నిను సమ్మతి కన్గొను యోగమున్ విశా

లాక్షి! యనుగ్రహింపుమని ప్రార్థన సేయుదు సర్వమంగళా! 104.

లలిత గుణాభిరామము, సులక్షణయుక్తము, భవ్యభావ సం
కలితమునైన నా మనము కాంతిమయంబగు మందిరమ్మునై
నెలవగు నందు నీకు ననునిత్యము భక్తిసుమాలు గూర్చి పూ
జలనొనరింతు వేడ్క సుర సన్నుత వైభవ! సర్వమంగళా! 105.

అమ్మ! "భవాని" శబ్దమున కర్థ విశేషమె కాక తత్ప్రభా
వమ్ము ప్రశంసనీయమగు భక్తులు తత్పద ముచ్చరించు మా
త్రమ్మున నీ కృపన్ బడసి తత్క్షణమే పరమార్థమైన మో
క్షమ్మును బొందుచుందురట సజ్జనపాలిని! సర్వమంగళా! 106.

భ్రమర వరాలకా! సరస భావ వినోదిని! మల్లికేశ హృ
త్కమల మరంద పాన నిరతా! కలనాదమయీ! భవత్పదా
బ్జముల భజించుచుండి భవ సాగర పారము చేర్పవేడుదున్
కమల వనీ విహారిణి! జగత్పరిపాలిని! సర్వమంగళా! 107.

ఏ గతియేని లేదనుచు నెందరొ కుందుచు నుందురయ్యు, నీ
వేగతి యెల్లవారలకు నెల్లెడలందు నటంచు నెంచరే
యోగము, క్షేమమున్ గనుచు నుండెదవెల్లరకో భవాని! నీ
వేగతి నీవె నీవె యని యెంతయు నమ్ముదు సర్వమంగళా! 108.

ఓ త్రిదశ ప్రపూజిత మహోజ్జ్వల రూపిణి! బ్రహ్మ విష్ణు రు
ద్రత్రితయాత్మకంబయి విరాజిలు తత్త్వము గల్గు నిన్ను గా
యత్రిగ గొల్చు వారి హృదయమ్ములు జ్ఞానమయమ్మొనర్చి, తా
పత్రయమున్ హరించు నిను భావన సేయుదు సర్వమంగళా! 109.

కనులకు విందుగా అరుణ కాంతులు చిమ్ముచు సంజె వేళలో
తనరెడు భాను బింబమును తన్మయమందుచు చూచుచుండ న
వ్వనరుహ మిత్ర బింబమున భాసిలు చుండిన నీదు తత్త్వమే
నను నడిపించి సత్పథమునన్ సుఫలంబిడు సర్వమంగళా! 110.

కొండలనెక్కనేల? బహు ఘోర భయంకర కాననమ్ములం
దుండగ నేలనో? గుహల నుండగ నేల? మహాగ్ని మధ్యమం
దుండగనేల? తోయముల నుండగనేల? తపమ్మొనర్ప, నీ
యండను దక్క వేరెచట నైనను నొల్లను సర్వమంగళా! 111.

ఆదిమ శక్తివీవు, పదునారు కళల్ విలసిల్లు తల్లి వ
ష్టాదశ నామ రూప మహిమాన్వితవై యనురాగమూర్తివై
వేదపురాణ శాస్త్రచయ వేద్యవునైన నినున్ భజించుచున్

నీ దరిజేర్పు మమ్మ! జననీ! యని పేడుదు సర్వమంగళా! 112.

అక్షియుగమ్ము నుండి కరుణామృత వర్షము చిందు శ్రీ విశా
లాక్షివి నీవె యంచు, శఫరాక్షివి నీవె యటంచు, నీవె కా
మాక్షి వటంచు నీదు వివిధాద్భుత తత్త్వములన్ దలంచుచున్
మోక్ష పద ప్రదాత్రి! నను బ్రోవగ పేడుదు సర్వమంగళా! 113.

ఓమ్మను మంత్ర వైభవ మనూహ్యము, దానికి కామరాజ బీ
జమ్మను, శక్తిబీజమును, సమ్మతి శ్రీమ్మను మంత్ర బీజ మం
త్యమ్ముగ నుండు సంపుటిని ధ్యాన మొనర్చెడు వారికెల్ల ని
త్యమ్మగు మోక్షమిచ్చెదు కదా! పరమేశ్వరి! సర్వమంగళా! 114.

నా మదిలోన నీదు చరణద్వయ చింతన చేయుచుండ నా
కేమి భయమ్ము? సర్వ భువనేశ్వరి! నిర్మలమై, ప్రశాంతమై
కామముఖారి దూరమయి, జ్ఞాన సముజ్జ్వలమై చెలంగుచున్
నా మది దివ్య ధామమగు జ్ఞాన సుధాంబుధి! సర్వమంగళా! 115.

అరుణ ధరాధరమ్ము పయి నద్భుత తేజముతోడ నొప్పు నీ
పరమ పవిత్ర తత్త్వమును భావన సేసిన యట్టి వారికిన్
త్వరిత గతిన్ వినాశమగు పాశములెల్లను తత్ క్షణంబె నీ
చరణ సరోజ ధామమున శాంతి లభించును సర్వమంగళా! 116.

సలుపుచుచుందు నీ భజన, సంతతమున్ నిను గొల్చు చుందు, ని
ర్మల మతి పేడుచుందు నిను మాత్రమె, తీయని నీదు నామముల్
పలుకుచునుందు, నీ యశము ప్రస్తుతి సేయుచునుందు, నీదు గా
థలు వినుచుందు నెంతయును తన్మయమొందుచు, సర్వమంగళా! 117.

నిచ్చెనలెన్నొ యెక్కితిని, నేనిట బంగరు జీవితమ్ములో
ముచ్చటలందు తేలుచును పొంగితి కాని, యివేమి మెచ్చకే
యచ్చపు జీవితాన నిను నాత్మ భజించుచు నిర్వికారినై
చెచ్చెర నీదు సన్నిధిని చేర దలంతును సర్వమంగళా! 118.

అద్దములోన చూడబడు నద్భుత చిత్రములీ ప్రపంచముల్
తద్దయు స్వప్న తుల్యములు ధాత్రి జెలంగెడు భోగభాగ్యముల్
వద్దివియెల్ల యంచు దృఢ భావముతో నిజ తత్త్వ దృష్టితో
హద్దులు లేని చిత్సుఖములందగ గోరుదు సర్వమంగళా! 119.

అంబర రమ్య సీమను సమంచిత కాంతుల నీనుచుండి, ర
త్నంబుల రాశులో యనగ తారక లెన్నియొ భూషణ ప్రకా
రంబుల వోలె నెంతయును రాజిలు నీదు సమాశ్రయంబుచే

నంబుజవాసినీ! మణిమయాంబర ధారిణి! సర్వమంగళా! 120.

అమ్మ! భవాని! నాదు హృదయంబను చక్కని పూల తోటలో
కమ్మని తావి నీనుచును కన్నుల విందొనరించు చుండు పు
ష్పమ్ము లనేకముల్ కలవు చయ్యన నే గొని తెచ్చి భక్తి భా
వమ్మున నీ కొనర్తును సువర్ణ సుమార్చన సర్వమంగళా! 121.

అంబరమందు సూర్యుడు, సుధాంశుడు, తారలు నొప్పు, వారి తే
జంబును మించి భాసిలును సంతత మద్భుత రీతి నాదు డెం
దంబను పావనాంబరమునన్ పరమంబగు నీదు తత్త్వమో
త్ర్యంబక భామినీ! నిను సమర్చన సేయుదు సర్వమంగళా! 122.

పుట్టుచు గిట్టుచున్ మరల పుట్టుచు గిట్టుచు దుఃఖ వార్ధి ని
క్కట్టులు పొందుచున్న మము గాచెడు తల్లివి నీవె వార్ధికిన్
గట్టున జేర్చుమా యనుచు గట్టిగ నీ పద వారిజాతముల్
పట్టుచు నేను వేడుదును బంధవిమోచని! సర్వమంగళా! 123.

ఆటలు మాకు నేర్పి ముదమందుచు నుందువు నీవు తల్లి! మా
మాటలు నాట పాటలును మంజులముల్ రస నిర్భరమ్ములై
నూటికి నూరు పాళ్ళును వినోదము గూర్చుచు నుండు కాదె? యో
హాటక గర్భ ముఖ్య దివిజావళి సేవిత! సర్వమంగళా! 124.

సలలిత భక్తి పుష్పములు, జ్ఞాన ఫలమ్ములు కల్గు, కల్పక
మ్ముల కిరపైన నా మనము పూవులతోటగ నొప్పు నీకు, నం
దలరుచు సుప్రసన్నవయి యాత్మ సుఖంబు నొసంగ గోరుదున్
లలిత! భవాని! శ్రీజనని! లాస్యవినోదిని! సర్వమంగళా! 125.

తొలుత పరాయనన్ జెలగి తోరముగా పరిణామ మొందుచున్
వెలువడి వైఖరీ యనగ విశ్వమునంతట వ్యాప్తమొందుచున్
పలుకులలో విశిష్టమగు భావములోన పవిత్ర తత్త్వమై
యలరెడు వేద వేద్య! నిను ప్రార్థన సేయుదు సర్వమంగళా! 126.

వరుస తిథుల్ పదారు ప్రతిపన్ముఖముల్ కల మండలమ్ములో
పరి పరి నామ రూపములు వైఖరులుంగల దేవతాళిగా
బరగుచు కాలమానమును బాగుగ కూర్చి, గ్రహక్రమమ్ము భా
సుర గతి నిర్ణయించితివి, సోమకళాధరి! సర్వమంగళా! 127.

ప్రకృతివి నీవె యందురు పురాణివి యందురు నిన్ను సన్మనుల్
సకల కళాధిదేవి శృతి సారమవందురు జ్ఞానులెల్ల. హృ
ద్యకమల సంస్థితా! నిను ననన్య శరణ్యను శంకరప్రియన్

త్రికరణ శుద్ధి కొల్చెదను దీనజనావన! సర్వమంగళా! 128.

ప్రముఖుల కగ్రపీఠమను భావనలేదట నీదు సన్నిధిన్
సమతను పాదు కొల్పెదట, సర్వ చరాచర కోటిలో సదా
మమతకు తావు నీయవట, మాదృశులవ్విధి నాచరించుచో
సముచిత యోగమిచ్చెదట, సర్వ శుభప్రద! సర్వమంగళా! 129.

సుకవుల హృత్సరోజములు సొంపెసలారగ జేయు బాల సూ
ర్యకిరణ కాంతి నొప్పు నిను స్వఛ్ఛ మనమ్ముల గొల్చువారికిన్
సుకరముగా లభించు నతిశుద్ధ వచోవిభవమ్ము సత్కవి
ప్రకర నుత ప్రభావ! నిను ప్రార్థన సేయుదు సర్వమంగళా! 130.

భక్తి మహా తరింగిణిగ పారుచు చేరును నీదు సన్నిధిన్
భక్తియె మంచి నౌకయయి భక్తుల జేర్చును నీదు చెంతకున్
భక్తివిశిష్ట యోగమును బాగుగ సాధన చేయుచుండి సే
ముక్తిని బొందగోరుదు ముముక్షు జనావన! సర్వమంగళా! 131.

పిల్లల యట్లు భక్తులను బెంచుచు నొప్పుగ భక్తి మాత తా
చల్లగ చూచుచున్ చదువు సంధ్యలు నేర్పుచు ప్రేమ మీరగా
సెల్లెడలందు బ్రోచుచును నిమ్ముగ సద్గుణరాజితో విరా
జిల్లగ జేసి భద్రముగ జేర్చును నీ దరి సర్వమంగళా! 132.

ఆకులు పూవులున్ ఫలము లంబువు లీయగవచ్చు గాని అ
మ్మా! కమనీయ వర్ణరుచిరార్థ రసాంచిత లక్షణాఢ్యమౌ
నా కవితా మనోహర వనమ్మును రమ్య విహార సీమగా
నీకు నొసంగుచుంటినిదె నిత్య శుభంకరి! సర్వమంగళా! 133.

భవము లనేక రీతులగు బాధల తావగునండ్రుగాని, నా
కవియొక లెక్క కాదు హృదయమ్మున నిత్యము నిన్ను నిల్పుచున్
సవినయ రీతి నీదు పద సారస సేవలు చేయుచుండు నా
భవమిది సార్థకమ్ము కద, భవ్య సుఖప్రద! సర్వమంగళా! 134.

ధ్యాన నిమగ్న మామక హృదంతర సీమను నీ స్వరూపమున్
గానగ వచ్చు నందె శితికంఠుని మూర్తియు గాన నౌను న
మ్మా! నయనాభిరామమగు నద్వయతత్త్వము మీది కాదె? వి
జ్ఞాన మహాంబుధీ! విబుధ కామిత దాయిని! సర్వమంగళా! 135.

నీవె మదగ్ని ఖండమున నిల్చి దహింతువు కర్మ పాశముల్
నీవె దినేశ ఖండమున నింపెద హొప్పుగ జ్ఞాన తేజమున్
నీవె హిమాంశు ఖండమున నెమ్మి యొసంగెదు శాంతిసౌఖ్యముల్

నీవె కదా పరాత్పరవు నిత్య సుఖప్రద! సర్వమంగళా! 136.

కనులను విప్పువేళ నిను గాంతును సర్వ చరాచరాళిలో
కనులను మూసియుంచునెడ గాంతును నిన్ హృదయాంబరంబునం
దనిశము నాదు భావనకు నంచిత సిద్ధి నొసంగునట్టి నీ
యనుపమ తత్త్వ వైభవము నాత్మ దలంతును సర్వమంగళా! 137.

అంబరవీథిలోన మిహిరాదులకున్ దగు కాంతి నిచ్చు ఫు
ల్లాంబుజ నేత్ర! నాదు దహరాంబర సీమ వసించుచుండి, తే
జంబును చేతనత్వమిడి స్వాంతమునున్ సకలేంద్రియాలు ని
త్యంబు వెలుంగ జేయు నిను ప్రార్థన సేయుదు సర్వమంగళా! 138.

సతుల మహత్త్వముల్ తెలియ శక్యమె? యద్భుత బాణ వృష్టితో
నతి బల విక్రమాఢ్యు నరకాఖ్యు నెదిర్చెను సత్యభామ, ధీ
మతి రవి నాపె నొక్క సతి, మాటల నేర్పున కాలుగెల్చె నొ
క్కతె కద, వారి తేజము జగత్ స్తవనీయము సర్వమంగళా! 139.

వివిధ సువర్ణ భూషలును వేద నినాద మొనర్చు చుండి, నీ
ప్రవిమల తత్త్వ వైభవము రమ్యముగా వినుతించు చుండు నో
శివ హృదయేశ్వరీ! నిగమ శీర్ష విలాసిని! తత్ ప్రశస్తియే
శ్రవణ సుఖమ్ము మా కొసగు సర్వ కళానిధి! సర్వమంగళా! 140.

ఉన్నది మాతృతత్త్వమను నుత్తమ భావము కల్గునట్లుగా
ఉన్నత మానసస్థితుల నొప్పుగ మా కొనగూర్చు చుండి మా
మన్నన లందు చుండెడి "ఉమా" పరమేశ్వరి! నీ విలాసమం
దున్న మహత్త్వమున్ దలతు యోగ వరప్రద! సర్వమంగళా! 141.

వలదుసుమా తపమ్మనుచు పల్కగ తల్లి "ఉమా" యటంచు, నా
పలుకులె నీకు ప్రీతినిడు పావన నామముగా చెలంగె, నీ
వలననె సోమశేఖరుడు ప్రస్తుతి నొందెను "సోము" డంచు, స
త్ఫల మిడునట్టి నామములు పల్కెడు వారికి, సర్వమంగళా! 142.

తారలనేకముల్ కలవు తళ్కుల నీనుచు నాకసాన నొ
ప్పారుచు నొక్క టొక్కటొక యద్భుత సూర్య కుటుంబమంట, య
వ్వారిజ సంభవాండముల పాలన సేసెడు నీదు తత్త్వమున్
సారమతిన్ దలంచుచును సంస్తుతి సేయుదు సర్వమంగళా! 143.

ప్రాయము మళ్ళు వేళ నిను ప్రార్థన సేయగ వచ్చుగాని, యీ
ప్రాయమునందె యేల? నను భావముతో నతి మూఢ చిత్తులై
మాయలలోన మ్రగ్గెడు నమాయకులన్ భువి నుద్ధరించి, చే

సాయము గూర్చి ప్రోవుము ప్రసన్న ముఖాంబుజ! సర్వమంగళా! 144.

చక్కగ నాడుచుందురట శైశవమందున, యౌవనమ్మునన్
మక్కువతో జెలంగెదరు మన్మథ లీలలలోన నా పయిన్
తుక్కయి చింతలొందుచును దుర్గతి గాంతురు వృద్ధు లక్కటా!
ఒక్కడ నేని నిన్ గొలువ రుర్వి విమూఢులు సర్వమంగళా! 145.

త్ర్యక్షర యుక్తమై తనరు తావక తత్త్వము లోకమాన్యమై
యక్షర రమ్యమై, వరదమై, శివమై, శ్రిత భక్తకోటికిన్
రక్షణ గూర్చుచున్ శుభ పరంపర లిచ్చుచు జ్ఞానదాత్రియై
మోక్షపదమ్ము నిచ్చు విధి ముఖ్య సురస్తుత! సర్వమంగళా! 146.

కాంతులనేక రీతుల జగమ్ముల నెల్లెడనింపు తల్లి మత్
స్వాంతము నందు జ్ఞాన విభవాంచిత కాంతులు నింపి సర్వదా
శాంతి సుఖాలు గూర్చి భవ సాగర తీరము జేర్చు నిన్ను న
శ్రాంతము గొల్తు నమ్మ! సుర సన్నుత వైభ! సర్వమంగళా! 147.

భావన కందరాదు శివభామిని! తావక తత్త్వమందురో
దేవి! చిదగ్నికుండమున తేజముతో ప్రభవింప, నీవు, లో
కావళి నెల్ల నిండెనట యద్భుత కాంతులు, నీ పదాబ్జ సం
సేవల చేత మన్మనము చిన్మయ మయ్యెను, సర్వమంగళా! 148.

శంకలు పూర్తిగా తొలగి, జ్ఞాన వికాసము గల్గు, శుద్ధ వి
ద్యాంకుర రూప వైభవ సమంచిత తావక దంత పంక్తి హృ
త్పంకజమందు భక్తిమెయి భావన చేసిన యట్టి వారికిన్
శంకర భామినీ! జనని! సర్వ శుభంకరి! సర్వమంగళా! 149.

రాజ కళాధరీ! యచల రాజసుతా! నటరాజ సుందరీ!
రాజ నిభాననా! త్రిదశరాజ సుపూజిత! రాజ్యవల్లభా!
రాజిత సద్గుణాఢ్య! మృగరాజ సమంచిత వాహనా! హృదం
భోజమునందు నిన్ దలచి మోదము నొందుదు సర్వమంగళా! 150.

మాలిని! హంసినీ! త్రిపుర మాలిని! చిన్మయ రూప! సత్కృపా
శాలిని! స్తుత్య సద్గుణ విశాలిని! శంకర తోషిణీ! జగ
త్పాలిని! భక్తలోక పరిపాలిని! శాంతి సుఖప్రదాయినీ!
శూలిని! నిన్ను గొల్తు విశుద్ధ మనమ్మున సర్వమంగళా! 151.

భండ ముఖాసురుల్, సమద బాహు బలాఢ్యులు, దుష్ట చిత్తులు
ద్దండత ధర్మ బాహ్యులయి దారుణ కృత్యములూను చుండగా
చండ పరాక్రమాన దితిజ ప్రతతిన్ వధియించినట్టి నిన్

నిండు మనమ్మునన్ గొలుతు నిత్య సుఖప్రద! సర్వమంగళా! 152.

అంబురుహాంబకుండు నిగమాగమ సూక్తులతో స్తుతింపగా
నంబురుహాంబకుండొక మృదంగము నింపుగ మ్రోయుచుండగా
నంబురుహాంబకుండు సరసాద్భుత తాండవ కేళి సల్ప, నో
యంబరొ! నీవు మోదమున నాడెదు లాస్యము, సర్వమంగళా! 153.

హరి నిను గొల్చుచుండు నిగమాగమ సూక్త విధానమొప్పగా
హరి భవదాశ్రయాన విజయాభయ సిద్ధిని బొందు నిమ్ముగా
హరి యొక వాహనంబయి సమంచిత సేవలొనర్చు భక్తితో
హరిణి! జగమ్ములేలు నిను నాత్మ భజింతును సర్వమంగళా! 154.

గణపతి నీ కుమారునిగ గారము నంది చెలంగు, తారకా
గణపతి నీ విభూషయయి కాంతుల నొందును, దేవ వాహినీ
గణపతి ముద్దు పట్టిగ సుఖమ్మును నింపుచునుండు, దేవతా
గణ పరివేష్టితా! సుజన కామిత దాయిని! సర్వమంగళా! 155.

జనని మదీయ మానస విశాల మనోహర పుష్పవాటికన్
దనరు నహింసయున్ దమము తాలిమి ధ్యానము శాంతియున్ తపం
బును దయ సత్యమన్ బరగు పూవులు కల్గిన కల్ప వృక్షముల్
నిను సుగుణాఢ్య చిత్తమున నిత్యము గొల్తును సర్వమంగళా! 156.

ఓ విజయ ప్రదాయిని! మహోజ్జ్వల తేజముతో చెలంగుచున్
నీవు మదంతరంగమున నెమ్మి విహార మొనర్చుచుండ నెం
తే వెలుగొందె మద్హృదయ నీరజ మంతట వైరి షట్కమున్
పేపెరపొంది పర్విడెను విశ్వవినోదిని! సర్వమంగళా! 157.

నీ త్రిపురాభిధేయము వినిర్మల భావ విరాజితమ్ము, వే
దత్రయమున్, జగత్త్రయము, త్ర్యంబక తత్త్వము, త్ర్యక్షరాళి, శ
క్తిత్రయ మాది నైక విధ దివ్య విలాస సమన్వితమ్మగున్
స్తోత్రమొనర్తు నీ మహిమ శుద్ధ మనమ్మున సర్వమంగళా! 158.

మణియని నీ ప్రభావమును మన్నన చేయుదు, నీ విలాసమే
ఘృణిమయమై జగత్త్రయము నెల్లెడలందున నింపు తేజమున్
అణచును దుష్ట శక్తుల నిరంతరమున్, మము బ్రోచుచుండు నో
త్రిణయన! సత్కళావిభవ తేజము గూర్పుము, సర్వమంగళా! 159.

అరయగ పంచ భూత మయమైన జగమ్మిది యెల్ల మాయ, న
శ్వరము నశాశ్వతమ్మని యసత్తని యందురు, బ్రహ్మమొక్కటే
స్థిరమును, సత్తు, శాశ్వతము, చిన్మయమయ్యది ధ్యేయమమ్మ! య

ప్పరమ పదమ్ము పొందదగు భాగ్యమొసంగుము సర్వమంగళా! 160.

మనమును చుట్టుముట్టినవి మాయ యనంబడు కారు చీకటుల్
కనుగొనలేక యుంటి నినుగావున చీకటులెల్ల బాపి నా
మనమున నిల్చి జ్ఞానమయ మార్గములో నడిపింపుమా, జగ
జ్జనని! వివేక వర్ధిని! ప్రసన్న ముఖాంబుజ! సర్వమంగళా! 161.

జననము నంతమున్ గలుగు సంసృతి దుఃఖమయంబు, మృత్యువే
యనబడు గాన దుఃఖ మయమైన భవాంబుధి దాటజేసి క్ర
న్నన నమృతత్త్వ యోగమిడి నన్ను భవత్పద సీమ చేర్పుమా
త్రినయన తోషిణీ! భగవతీ! మృదుభాషిణి! సర్వమంగళా! 162.

ఎల్లరు శాంతి సౌఖ్యముల నిమ్ముగ గాంచుచు నొప్పునట్లుగా
నెల్లరు నెట్టి రోగముల నేనియు బొందక యుండునట్లుగా
నెల్లరు సర్వ భద్రముల నెల్లెడలందును బొందునట్లుగా
తల్లి! యనుగ్రహింపుము, సుధారస శేవధి! సర్వమంగళా! 163.

తల్లివి నీవు, సర్వ సుఖదాత్రివి, నీ యనురాగపాత్రులై
యెల్లరు నెట్టి దుఃఖముల నేనియు బొందక శాంతి తోడ వ
ర్ధిల్లుచు, నెమ్మనమ్ముల నుతించుచు నుందురు నీ ప్రభావమున్
సల్లలితాంతరంగ! స్మిత చారు ముఖాంబుజ! సర్వమంగళా! 164.

శ్రీవిధి నీ సపర్యలను జేయుచు స్తోత్ర మొనర్తురెల్ల వా
గ్దేవత లెల్ల వేళలను దివ్య వచస్సుమరాజి తోడ మే
మావిధమున్ దలంచునెడ నక్షర యోగ మనుగ్రహింతువో
దేవగణార్చితా! భగవతీ! పరమేశ్వరి! సర్వమంగళా! 165.

ఒక్కటినుండి యార్వరకు నొప్పగు మోములు గల్గియుండి, యొ
క్కొక్క సరోజ మధ్యమున నొక్కొక రీతిగ నామరూపముల్
చక్కగ దాల్చి, యోగులకు సద్గతి చూపుచు, నూతమిచ్చి, పెం
పెక్కిన భవ్య యోగముల నిచ్చుచు బ్రోతువు సర్వమంగళా! 166.

కులపథమందు నేగుచును కుండలినీ ప్రథితాకృతిన్, మహో
జ్జ్వల మగు కాంతితో సరసిజమ్ముల నారిటి దాటి యందు వే
దళముల నొప్పుచుండు సిత తామరసంబున నీశుజేరి శో
భిలు నిను నే స్మరించుచును వేడుక లొందుదు సర్వమంగళా! 167.

గణములు, ప్రాసలున్, యతులు కమ్ర విభూషణ రాజి ముఖ్య ల
క్షణములు నీ ప్రసాదములు, శబ్దము, భావము, వర్ణరూప స
ద్గుణములు నీ విలాసములు, కూరిమి నీదు కృపా కటాక్ష వీ

క్షణములచే రచించితిని సత్కృతి నియ్యది సర్వమంగళా! 168.

వరలు విశేష భక్తిరస బంధురమై, మధురమ్మునై, సువ
ర్ణరుచి సమేతమై ప్రణవనాదముతోడ పవిత్రమై, మనో
హరమయి నీ కృపామహిమ నద్భుతమై యిది స్తోత్రరత్నమై
స్థిరముగ లోక మాన్యమయి, చిన్మయ రూపిణి! సర్వమంగళా! 169.

అమ్మవు నీవు, నీదు హృదయమ్ము దయార్ద్రము, త్ర్యంబకుండు భ
స్మమ్మొనరింప కోపమున, మారుని, నీవు మహేశు వేడి, ప్రా
ణమ్ము నొసంగి ప్రోచితివి, నా పయి నేనియు జాలిచూపి, బం
ధమ్ముల బాపి నిత్య సుఖ ధామము జేర్పుము, సర్వమంగళా! 170.

నా మది నాక్రమించుకొని జ్ఞాన ధనమ్మును కొల్ల గొట్టుచున్
కామ ముఖారు లార్వురును గాఢ తమమ్మున నన్నుద్రోయ, నా
కేమియు పాలుపోక గతి వీవని నీ పదమాశ్రయించితిన్
నా మదిలో వసించి రిపు నాశమొనర్పుము సర్వమంగళా! 171.

తనదు కవిత్వ తత్త్వ రసతత్పరుడై కవినాయకుండు, మీ
తనయుడు దిగ్గజాల్ పొగడ తన్మయమందుచు నున్న వేళ నా
తనిగని మోదమంది కవితా విభవమ్ముపయుక్తమౌ జగ
మ్మున కని ప్రోత్సహించితివి భూరి కృపానిధి! సర్వమంగళా! 172.

ఆరుదినాల ప్రాయమున నద్భుత విక్రమశాలియై యనిన్
తారక ముఖ్యులైన బల దర్పిత దైత్యుల గూల్చె మీ సుతుం
డారు మొగాల వేల్పు, రిపు లార్వురిచే వ్యథలొందుచున్న నా
యారట దీర్పుమమ్మ! విజయమ్మును గూర్పుము, సర్వమంగళా! 173.

చెరకును వింటిగా, విరులుచెన్నగు నమ్ములుగా నొనర్చుచున్
స్మరుడు వశమ్మొనర్చుకొను చయ్యన నెంతటి ధీరునేనియున్
వరమట యా పరాక్రమము వానికి నీ చరణాంబుజాత సం
స్మరణ విధాన నో జనని! సజ్జన పోషిణి! సర్వమంగళా! 174.

హరి నిను గొల్చి నీదు కరుణామృత పానమొనర్చి కార్యత
త్పరుడయి, సర్వలోక పరిపాలన సేయుచు, దైత్యలోక సం
హరణము సేయుచుండును మహాద్భుత ధీయుత శక్తిమంతుడై
సురగణ సేవితా! త్రిపుర సుందరి! చిన్మయి! సర్వమంగళా! 175.

నలువ రచింపగా భువన నాటకముల్, హరి సూత్ర ధారిగా,
చెలగ, సమస్త జీవతతి చెన్నగు పాత్రలలో నటింప, ని
చ్చలును వినోద మందుచును సర్వ జగమ్ముల నేలుచుండు నిన్

దలచి భజింతు సాదృతి సదాశివ భామిని! సర్వమంగళా! 176.

పలుకుల తల్లి గొల్చునెడ వాగ్విభవమ్ము ననుగ్రహించు, ని
స్తుల ధన ధాన్య రాశులిడి శోభలు గూర్చును వార్ధి కన్య, మం
గళ నికరమ్ములిచ్చు గిరి కన్యక, నిచ్చలు భక్తకోటికిన్
సలలిత రీతి నీవిడెదు శాశ్వత మోక్షము, సర్వమంగళా! 177.

నిను స్మరియింపనెంచి మది, నీ కథలన్ విను వేడ్క వీనులున్
నిను గనగోరి కన్నులును, నీ పద పూజలొనర్ప చేతులున్
నిను వినుతింప నాలుకయు, నీ కభివాదమొనర్ప శీర్షమున్
నను దొర జేయుచున్నవివె, నాకిదె భాగ్యము, సర్వమంగళా! 178.

కురియుచునుండ వర్షముగ కూరిమి నీ కరుణామృతమ్ము సా
దరమున గ్రోలి తద్రసము తన్మయమందెడు భక్తకోటికిన్
పరమపదమ్ము లభ్యమగు భవ్యఫలమ్ముగ నేను నేని త
త్పరమ పదమ్మొసంగుమని ప్రార్థన సేయుదు సర్వమంగళా! 179.

భ్రమరమ వీవు నీ పరమ పావన దర్శన భాగ్యమొంది, నీ
సుమధుర నాదమున్ వినుచు, శుద్ధమనమ్మున నిన్ భజించుచున్,
క్రమముగ నేను నీదు పద కంజ సమీపము నందు నొప్పుగా
భ్రమరముసై చెలంగెదను, భక్తజనావన! సర్వమంగళా! 180.

## దండకము

శ్రీమన్మహేశార్ధ గాత్రీ! హిమాద్రీశపుత్రీ! త్రిలోకాధినేత్రీ! సదా భక్త సంప్రార్థితార్థ ప్రదాత్రీ! చిదానంద రూపా! జగజ్జాల దీపా! తమోఘ్ను ప్రదీపా! సువర్ణ స్వరూపా! సదా దేవ బృందంబు సేవించు నీ దివ్య పాదాంబుజాతంబులన్ నేను ధ్యానింతు నేకాగ్ర చిత్తాన నో వేదమాతా! భవాంబోధిపోతా! త్రిలోకైక మాతా!

సదా లోక కళ్యాణమున్ గూర్చు నీ మందహాసంబు, నీ చిద్విలాసంబు, నీ ప్రేమ తత్త్వంబు, పీయూష సారంబు, నానంద సంవర్ధకంబై విరాజిల్లు నో తల్లి! దీవ్యత్ కృపా కల్పవల్లీ!

మహాదేవుడున్ నీవు నెల్లప్పుడున్ వాక్కునున్ భావమన్ రీతి నన్యోన్య సంపృక్త గాత్రంబుతో నొప్పు మీ లీల లోక త్రయీ భావ్యమై, సర్వ సంసేవ్యమై, నవ్యమై, దివ్యమై, భవ్య యోగానుసంధాయకంబై విరాజిల్లు చుండున్ జగద్గీత కీర్తీ! సదానంద మూర్తీ! మహా భక్తి భావంబుతో నిన్ను సేవించి, నీ నిండు వాత్సల్యమున్ గాంచు పుణ్యాత్ములన్ బ్రోచి, సౌఖ్యంబు చేకూర్చి, శోకంబు పోదీర్చి, నీ పాద పద్మంబులన్ జేర్చునో యమ్మ! మా చింతలన్ దీర్చుమా, శాంతి సౌఖ్యమ్ములన్ గూర్చుమా, నిత్య కళ్యాణ యోగంబు సిద్ధింపగా చేయుమా, శంభు ప్రాణేశ్వరీ! రాజ రాజేశ్వరీ! సర్వ లోకేశ్వరీ! ప్రేమ రూపా!
నమస్తే, నమస్తే, నమస్తే, నమః .. .. 181

మంగళమహాశ్రీ:

మంగళము శ్రీ లలిత! మంజుల వచః కలిత! మంగళము పర్వత సుపుత్రీ!
మంగళము భక్త జన మానిత యశో విభవ! మంగళము సాంబశివ గాత్రీ!
మంగళము దివ్యమణి మండిత మహాసదన! మంగళము సర్వ శుభ దాత్రీ!
మంగళము సాధుజన మానస లసన్నిలయ! మంగళము మంగళమహాశ్రీ .. 182

## ఫలశ్రుతి

ప్రవిమల భక్తి భావమున బాగుగ నీ స్తవ మెవ్వరేనియున్
శ్రవణమొనర్చినన్ చదివినన్ తొలగున్ దురితమ్ము లన్నియున్
భవహరమౌను తావక కృపా విభవమ్మున నిశ్చయమ్ముగా
శివ హృదయాంబుజ భ్రమర! చిత్సుఖదాయిని! సర్వమంగళా! .. 183

# ఓం తత్ సత్